కథా నిలయం
శ్రీకాకుళం

# 7. 'నీకు తెలుసుగా నాన్నా!'

రేపు సంక్రాంతి.

మా లోగిలి పండగ పరిమళాన్ని గుబాళిస్తోంది. ఇల్లంతా కోలాహలంగా వుంది. చాలా కాలం తర్వాత - మా నలుగురు తమ్ముళ్ళూ కుటుంబసభ్యులతో కలిసి పండక్కి నాలుగురోజులు ముందుగానే వచ్చారు. నాకూ నాతో పాటు మా కుటుంబంలో ఒకర్తెగా మారిపోయిన రాధమ్మకు ఊపిరి సలపనంత పనిగా ఉంది.

ఈ నాలుగు రోజుల్నుంచీ నాకు మనసు మనసులో లేదు. మా వాళ్ళందరూ ఆ విషయంలో ఏకతాటిమీది కొచ్చేశారు. చెప్పిన అభిప్రాయాన్నే మళ్ళీ మళ్ళీ చెబుతున్నారు.

నేను ఉక్కిరిబిక్కిరవుతున్నాను. ఊపిరి అందీ అందనట్టు గుండెల్లో ఆందోళనగా వుంటోంది. మనసంతా దిగులు దిగులుగా వుంటోంది. అస్థిమితంగా పచార్లు చేస్తున్నాను.

'రామ్మూర్తీ' అంటూ గదిలోంచీ అమ్మ కేకేసింది. వెళ్ళాను. ఆమె వో కునుకు తీస్తున్నదనుకున్నాను. లేదు. మంచం మీద కూచుని నా మూడో తమ్ముడు సత్యం కూతురు - పదేళ్ళ బుల్లికి జడ వేస్తోంది.

"చెప్పు" అని "నీకెందుకమ్మా ఈ పన్లు. నువ్ విశ్రాంతి తీసుకో" అన్నాను.

"నాకు వి..శ్రాం...తే... గదా" అని చిరునవ్వుతో సాగదీసింది మాటని. క్షణాల తర్వాత చెప్పింది, "ఈ బుల్లికి అదేదో 'టాబ్లెట్టు'ట. అది కావాలిట. వాళ్ళ అమ్మానాన్ననడిగితే కోప్పడుతున్నార్ట.'

"అంటే ఏవిటమ్మా? మనం కొనిద్దామా?" అడిగాను. 'అది వో చిన్నసైజ్ లాప్‌టాప్ అమ్మా' అనీ అన్నాను. నా స్వరంలో ఏ భావాన్ని చదువుకుందోగానీ, కొన్ని క్షణాలు మౌనంగా వుండిపోయింది అమ్మ.

నేను అమ్మతో మాట్లాడబోతుంటే, రెండో తమ్ముడు మాధవ లోపలికొచ్చాడు. అతని వెనగ్గా అతని భార్య సుగుణ కూడా వచ్చింది.

బయటనుంచీ పెద్ద తమ్ముడు చంద్రమోహన్ కేకేశాడు. "అన్నయ్యా నీ కోసం ఎవరో వచ్చారు" అని.

నేను బయటికి నడిచాను.

ఆఫీసు గదిలో నా కోసం నారాయణగారు వేచి ఉన్నారు. ఆయన హరిదాసు. ఆ రాత్రికి గుడిలో తన ప్రోగ్రాం గురించి చెప్పి ఆహ్వానించాడు. సెలవు తీసుకుంటూ, వొకసారి లోగిలినంతా కలయజూసి, "అదృష్టవంతులు రామ్మూర్తిగారూ, ఇవ్వాళారేపూ ఇంత లోగిలిని చూసే అవకాశం లేదు. తూర్పు వాకిలి. పెద్ద స్కూలు బిల్డింగ్‌లా వుంది." అన్నాడు.

"అవును, ఉత్తరదక్షిణాల్లో ఐదేసి గదులు. తూర్పున నాలుగు, పడమర నాలుగూ గదులు."

"గదులు కావులెండి - హాళ్ళంటే బాగుంటుంది. దానికేం గాని అసలు లోవాకిలే రెండు టెన్నిస్ కోర్టులంత వుంది. చెట్లూ, మొక్కలూ. ఎంతో ఆనందంగా వుంది. వెనుక పెరట్లోనూ మంచి వృక్షసంపద కనిపిస్తోంది. తాతగారి అభిరుచికి నిదర్శనం మరి!" అని కదిలారు.

నా గుండెల్లోని ఆందోళననీ, మనసులో అలజడినీ కలచినట్లయింది. ఆలోచనల సుడిలో ఈదుతూ, తిరిగి అమ్మగదిలో కొచ్చాను.

చామంతి పూలతో బుల్లికి జడ అల్లటం పూర్తి చేసింది అమ్మ. "ఇప్పుడు చూడవే. ఎంత ముచ్చటగా వుందో. పెద్ద జుట్టున్న నీలాంటివాళ్ళు అట్టా జుట్టు విరబోసుకుని తిరగకూడదమ్మా. వెళ్ళు. వెళ్ళి మీ అమ్మకు చూపించు" అని బుల్లి బుజం తట్టింది. "నైస్ గ్రాండ్ మా" అంటూ చలాకీగా పరిగెత్తికెళ్ళింది బుల్లి. ఇప్పుడు గదిలో మాధవ, సుగుణ లేరు. వెళ్ళిపోయినట్లున్నారు.

అమ్మ అన్నది, "వాళ్ళేదో చెప్పాలని వచ్చారుగానీ చెప్పలేకపోయారు. పొడిపొడి మాటలతో వెళ్ళిపోయారు నాన్నా. నిన్న రాత్రి చంద్రమోహనూ, వాళ్ళావిడ పద్మ కూడా ఇట్టాగే చాలాసేపు కూర్చుని వెళ్ళారు. వాళ్ళ ముఖాల్లో ఏదో కళవళం. ఆందోళనా వున్నై. చెప్పండ్రా అంటే మొహమొహాలు చూసుకుని, మాట పెగల్చుకోలేకపోయారు. పిచ్చి పిల్లలు. వాళ్ళకీ వీళ్ళకీ ఏవన్నా కావాలో ఏమిటో! చూడు. అన్నీ నీకు తెలుసుగా నాన్నా!" అన్నది.

ఇదే అమ్మమాట! అన్ని సందర్భాల్లోనూ, అన్ని సమస్యల్లోనూ నన్ను నడిపించిన అమ్మమాట!

అమ్మ అపురూప వాత్సల్యమంతా ఆమె మాటలోనే వర్షిస్తుంది. ఆ మాటల చల్లదనపు స్పర్శని మేమంతా అనుభవించినవాళ్ళమే!

నాన్నగారు వకీలుగా తన కేసుల గొడవల్లో తాను మునిగి తేలుతుంటే, సంసార రథాన్ని ఒక్కత్తెగా లాక్కొచ్చిన సహనశీలీ, నేర్పరీ అమ్మ. ఆమెతోనే మా అందరి అనుబంధం. పండిత విద్యల్ని ఔపోసన పట్టిన అమ్మ వ్యక్తిత్వప్రభావం నా మీద మరీ ఎక్కువగా ఉంది. పొదుపునీ, పరువు విలువనీ, పలుకుతీరునీ, కుటుంబ గౌరవాన్నీ, దాని పాటింపునీ తానై నేర్పింది. నిబ్బరం, ఆత్మవిశ్వాసం, స్థిత ప్రజ్ఞలకి ఆమె నిలువెత్తు సంతకంగా నిలిచింది. నాన్న మరణం తర్వాత కుటుంబం కోసం నేను పెళ్ళిచేసుకోదలచుకోలేదని చెప్పినప్పుడు అమ్మ ఒక్కటే మాట చెప్పింది, "నువ్వీనాడు తీసుకొనే నిర్ణయాన్ని గురించి జీవితంలో ఏనాడూ పశ్చాత్తాపం చెందే అవకాశం వుండకూడదు. అలాగే త్యాగం ప్రశంసల్నీ, పొగడ్తల్నీ కోరుకోదు" అని.

మా దూరపు బంధువు రాధమ్మ తన భర్త చనిపోయి, ఒంటరిగా మా యింటికొచ్చిన నాడు అమ్మ నన్ను పిలిచి ఒకేమాట చెప్పింది, "రాధమ్మ మీ అందరికీ చెల్లెలు లేని లోటు, నాకు కూతురు లేని లోటూ తీరుస్తుంది. నీకు తెలుసుగా నాన్నా- ఆమె మనసు నొప్పించకు" అని.

అమ్మ మాటలు నాకు కొండంత స్థిరచిత్తాన్ని ప్రసాదిస్తాయి.

అసలు – అమ్మ తానొక పెద్ద నిండుకుండ. అందుకనే – ఆమెకి క్యాన్సర్ అనే వాస్తవాన్ని విని –నేనూ, రాధమ్మ ఇతరులం ఎంత షాక్‌కి గురయినా, ఆమె మాత్రం గుండె దిటవుతో, ఆత్మ విశ్వాసంతో దాన్ని ఎదుర్కోగలిగింది, ఎన్నెన్నో చికిత్సలకూ తట్టుకుంది. కానీ, గడచిన పదేళ్ల నుంచీ ఆమెది మంచం బతుకు అయిపోయింది. అయినా, ఆమె మాటే నాకు నిరంతర కరదీపికగా నిలుస్తోంది.

ఆలోచనల్ని పక్కకినెట్టి, అమ్మతో విషయ ప్రస్తావన చెయ్యబోతుంటే – మా నాల్గో తమ్ముడు భాస్కర్, వాడి భార్య మేరీ లోపలికొచ్చారు.

'కూచోండి' అని వారికి సైగచేసింది అమ్మ. ఆమె మొహంలో అలసట కనిపిస్తోంది. వాళ్ళు కూర్చున్నారు.

'మిమ్మల్ని చూసి నాలుగేళ్ళయింది. చాలా గిల్టీగా వుంది. కానీ, మా పరిస్థితి మీకు తెలుసుగా అత్తయ్యా, ఇద్దరివీ పెద్ద ఉద్యోగాలు. ఎక్కడో ఢిల్లీలో నివాసం. అనేక ఈతిబాధలు, దానికి తోడు ఇద్దరు ఆడపిల్లలు. వాళ్ళవి హాస్టల్ బతుకులు" అని భర్త వైపు చూసింది మేరీ.

"ఇప్పటి అవస్థలూ, అవసరాలూ సరే అమ్మా. ముందున్న బాధ్యతల్ని గురించీ ఆలోచించుకోవాలి గదా మేము' అన్నాడు భాస్కర్.

ఆ తర్వాత మౌనంగా వుండిపోయారిద్దరూ. పక్కలో సర్దుకుని, అటువైపు మరలి పడుకుంది అమ్మ. నాకు -భాస్కర్ మేరీల ప్రేమవ్యవహారం, మేరీ తల్లిదండ్రుల గొడవలూ - అన్నీ కళ్ళముందు మెదిలాయి. ఆనాడు, ఆ క్లిష్ట స్థితిలోనూ, అమ్మ ఒక్కటే మాట చెప్పింది నాకు, "నీకు తెలుసుగా నాన్నా. ఉచితమైనది చెయ్యి" అని! వాళ్ల వివాహం జరిగింది.

భాస్కర్, మేరీ ప్రస్తుత సందర్భాన్ని గమనించారు. "ఇద్దరు ఆడపిల్లల పేరెంట్స్‌మి. అంతకంటే ఏం చెప్పగలమత్తయ్యా' అని లేచింది మేరీ. తమ్ముడూ కదిలాడు.

వాళ్ళు వెళ్ళిన తర్వాత కొన్ని నిముషాలు నేనూ మౌనంగానే గడిపానక్కడ. అమ్మ గట్టిగా ఊపిరి తీసుకుని, యథాలాపంగా- 'సరి' అని మాత్రం అన్నది.

నాకిప్పుడు ఆమెతో ఏవీ చెప్పాలనిపించలేదు. "నువ్ విశ్రాంతి తీసుకో అమ్మా. తర్వాత మాట్లాడుకుందాం" అంటూ నేనూ బయటకి నడిచాను.

రాత్రి భోజనాలయ్యేసరికీ పొద్దుపోయింది.

లోగిలి మధ్య ఖాళీస్థలంలో కుర్చీలు వేసుక్కూచున్నాం మేమంతా.

తమ్ముళ్ళూ, మరదళ్లూ, అంతా కూడబలుక్కుని వచ్చినట్టు- అదే విషయాన్ని పదే పదే చెప్పుకొచ్చారు.

కాకుంటే, మధ్య మధ్య తమ కుటుంబ అవసరాల ఘోషనీ, వెంటనే ఉన్న డబ్బు అవసరాన్నీ ప్రత్యేకంగా ఎవరి శైలిలో వారు వెళ్ళబోసుకున్నారు.

అప్పుడన్నది రాధమ్మ "మీరంతా ఎన్ని విధాలుగా చెప్పినా, ఆంతర్యం వొక్కటే, ఇంటిని బిల్డర్ కిచ్చేయాలి. వచ్చే డబ్బుని పంచుకుపోవాలి అంతేగా!"

ఆమె మాటలమీద పెద్ద చర్చే జరిగింది. చర్చ మధ్యలో కల్పించుకుంది మా సత్యం భార్య వరమ్మ. "విషయాన్ని తేల్చకుండా ఎన్నేళ్ళు నానుస్తారు? ఎప్పుడైనా

అత్తయ్యకి చెప్పక తప్పదుకదా? ఆమె అనారోగ్యమనీ, ఆమెకు ఈ ఇంటితో అనుబంధమనీ - ఏవేవో అనుకుంటూ - ఇట్టా మమ్మల్నందర్నీ ఇరకాటాన పెట్టటం ఏమీ బాగాలేదు" అని కటువుగానే అన్నది.

రాధ మనస్సు చివుక్కుమందని తెలుస్తూనే వుంది నాకు. నేనేమీ కించపడలేదు.

ఇదే సమయమన్నట్టు మిగిలినవాళ్ళు పెదవి విప్పి, స్వరం పెంచి అదే విషయాన్ని చెప్పారు.

ఆ మాటల్ని, ఆ దారినే సాగనీయకుండా "సరే పండగ కానీయండి చూద్దాం" అన్నాన్నేను.

"ఏది ఏమైనా ఈ విషయాన్నొక కొలిక్కి తేవాలి. మా అందరి మాటా ఇదే" అని "అవును కదా అన్నయ్యా?" అని చంద్రమోహన్ వైపు చూశాడు భాస్కర్. అతను అవునన్నట్టు తల పంకించాడు.

పండగ సరదాగానే గడిచింది.

కనుమరోజు మధ్యాహ్నం అమ్మ నిద్రపోయి లేచింది. అమ్మ దగ్గర కూచున్నాను. కొంచెం సేపు పిచ్చాపాటీ అయిన తర్వాత అసలు సంగతి చెప్పాను. "తమ్ముళ్ళూ మరదళ్ళూ ఇంటిని బిల్డర్‌కిచ్చేద్దామని నిర్ణయించారమ్మా".

ఆమె ఏమీ బ్రాన్పడినట్లుగా కనిపించలేదు. మౌనంగా నావైపు చూసింది. క్షణాల తర్వాత అన్నాను, "మంచి ఆఫర్ అంటున్నారు. ఒక్కొక్కరికి రెండు ఫ్లాట్‌లూ, కొంత క్యాషూ వస్తాయిట" అని.

వేదాంతిలా సన్నగా నవ్వింది అమ్మ.

"నీ నిర్ణయం ఎట్టా వుంటుందో అని మల్లగుల్లాలు పడుతున్నారమ్మా. నోరు తెరచి అడగలేక బెరుకు బెరుగ్గా తిరుగుతున్నారు" అన్నాను.

"ఇది మరీ బాగుంది" అని ఆగింది. నాకు తెలుసు, జ్ఞాపకాల నేపథ్యంలోకి, అనుభవాల వాతావరణంలోకీ నడిచిందామె. ఈ లోగిలంతా ఆమెకు స్త్రీధనంగా వచ్చింది. ఆమెకు ఆడపిల్లలు లేకపోవడంవల్ల ఆమె జీవితకాలంలోనే ఆస్తి గురించిన నిర్ణయం జరిగితే మంచిదని అనేకసార్లు మా లాయర్‌గారు సలహా ఇచ్చారు. ఇదే అసలు కారణం నా తమ్ముళ్లందరూ ఇంటిని గురించిన తీర్మానం జరగాలని భావించటానికి కారణం.

చాలాసేపటికి ప్రస్తుతంలోకి వచ్చి మంద్రస్వరంలో అన్నది అమ్మ, "ఏం చేయాలో నీకు తెలుసుగా నాన్నా" అని!

ఆమెగా చెప్పే ఏకైక వాక్యాన్నే ఇప్పుడూ చెప్పింది!

నేను ఆలోచనలో పడ్డాను.

ఏం చేయాలో నిజంగా నాకు తెలుసా? త్వరలోనే మా లోగిలికి శతవార్షికోత్సవాన్ని జరుపుకోవాలనుకున్న నా కోరికకు ఏది ముగింపు? అసలు అమ్మ మనసు ఏమిటి? ఆమె నిర్ణయం ఏమిటి?

శతకోటి ప్రశ్నలు నా మేధలో సుళ్ళు తిరిగాయి.

* * *

ఇప్పుడు ఉగాది వచ్చింది.

మా లోగిలంతా కోలాహలంగా ఉంది. మా వాళ్ళంతా వచ్చారు.

మా తమ్ముళ్ళకీ, మరదళ్లకీ నిజంగా పండుగరోజు.

సాయంత్రం నాలుగైంది. బిల్డరూ, అతని తరపున అడ్వొకేట్. ఇతర భాగస్వాములూ కలిసి వచ్చారు.

రాధమ్మ మాత్రం బిక్కమొహంతో తిరుగుతోంది. గుంటలు పడ్డ కళ్ళతో, పీక్కుపోయిన మొహంతో దిగులు దిగులుగా ముభావంగా తిరుగుతోంది. ఈ వ్యవహారం ఇట్టా పరిణమించినందుకు అమ్మ మనసు తెలిసిన ఆమె బాగా కలత చెందింది. నా పరిస్థితీ అదే అయినా, పెద్దరికం బహుశా నన్ను ఏకులబుట్టని చేసినట్టుంది. నిబ్బరంగా పనులు చేసుకుపోతున్నాను.

కాఫీలయినై. "మూడువేల అడుగుల స్థలం. ఆరు వాటాలు, బాగా అమరింది" అంటూ "మరి అమ్మగారు చివరి మాట అనేస్తే..." అని ఎగ్రిమెంట్ డ్రాఫ్ట్ కాపీని నా చేతికి అందించాడు అడ్వకేట్.

నేను దాన్ని తీసుకుని అమ్మ గదికేసి కదలబోయాను. రాధమ్మ కూడా నిలబడింది. ఇంతలో అమ్మగదిలోంచీ ఏడుస్తూ పరిగెత్తుకొచ్చింది బుల్లి- "పెదనాన్నా, పెదనాన్నా, నానమ్మ మాట్లాడటల్లేదు" అంటూ.

గుండె లదిరినై.

ఒక్క అంగలో అమ్మ గదికి చేరాను.

నా వెనగ్గా రాధమ్మ...

ఆమెను అనుసరించి అందరూ.... ఇంటిల్లిపాదీ వచ్చారు.

ఆత్రుతగా అమ్మని చూశాను. చెయ్యి పట్టుకుని పరీక్షగా కదిలించాను. అటూ ఇటూ... వారినీ, వీరినీ చూపులతో ప్రశ్నించాను.

అమ్మ మాత్రం నిశ్చలంగా, నిశ్చలనంగా 'నీకు తెలుసుగా నాన్నా' అంటున్నట్టుగానే పడుకుని వుంది!!

* * *

ఇంటిని గురించిన పరిష్కారం కోసం మా తమ్ముళ్ల ఆందోళన, మరదళ్ల ఆలోచనా సాగుతూనే ఉన్నాయి.

'నీకు తెలుసుగా నాన్నా' 'రాధమ్మ మీకు చెల్లెలు లేని లోటు, నాకు కూతురు లేని లోటూ తీరుస్తుంది' అన్న అమ్మ మాట నా చెవుల్లో మారుమోగుతూనే ఉంది.

అన్ని పరిష్కారాలకీ కాలమే పూనుకోవాలి.

అమ్మ అన్నట్టు 'నాకు తెలిసింది' చేశాను.

మా లోగిలి 'పార్వతీ రెసిడెన్సీ'గా రూపుమార్చుకోకుండా నిలిచే ఉంది!!

(ఆంధ్రభూమి వార పత్రిక, 19.6.2014)